సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సత్యనారాయణ



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నేత సత్యనారాయణ

చంపాపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ మారుతీనగర్‌కాలనీకి చెందిన బీఆర్ఎస్ నేత, అసంఘటిత కార్మిక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25సంవత్సరాల నుంచి భవన నిర్మాణ కార్మిక రంగాలలో పని చేస్తున్న వారికి 5వేల లేబర్ కార్డులు అందించి వారి హక్కులు కాపాడినట్లు తెలిపారు. దాదాపు 78 కంపెనీలలో యూనియన్స్ ఏర్పాటు చేసి కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, మినిమంవేజ్, బేసిక్ డీఏ వచ్చే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డితో పాటు ఇతర చోట్ల పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తనవంతు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎంఐఎంతోనే పాతబస్తీలో మతసామరస్యం

● ఎమ్మెల్యే బలాల



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పాతబస్తీలో మతసామరస్యం కోసం కృషి చేసేది ఒక్క ఎంఐఎం అని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మంగళవారం చంచల్‌గూడలోని పలు ప్రాంతాల్లో హైదరాబాద్ ఎంఐఎం ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం ప్రజలతో ఉంటూ, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేసేది ఒక్క ఎంఐఎం అని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో చావునీ కార్పొరేటర్ సలాం షాహిద్‌మూన్, మాజీ కార్పొరేటర్ ముర్తుజా అలీతోపాటు పలువురు పాల్గొన్నారు.



ర్యాలీలో మంత్రి సబితారెడ్డితో కలిసి బీఆర్ఎస్ మీర్‌పేట్ కార్పొరేషన్ నేతలు

కాసాని నామినేషన్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

సరూర్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ మంగళవారం రాజేంద్రనగర్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల నుంచి మంత్రి సబితారెడ్డితో కలిసి ఆ పార్టీ నేతలు భారీగా పాల్గొన్నారు. సబితారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని రాజేంద్రనగర్‌కు చేరుకున్నారు. ఈ ఎన్నికల్లో తమ బీసీ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు.

భువనగిరి కోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



భువనగిరి ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

వనస్థలిపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): భువనగిరి కోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని పార్టీ రాష్ట్ర నాయకుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్‌గుప్తా నివాసానికి విచ్చేసి రాబోయే ఎన్నికల్లో తమకు మద్దతు కావాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో పర్యటించి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు కృషి చేసి భువనగిరి కోటపై పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో తట్టిఅన్నారం మైసమ్మ ఆలయం చైర్మన్ సుక్క శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు జోగు రాములు, చిరంజీవిగౌడ్, భవానిగౌడ్, సాయిగౌడ్, వెంకటస్వామి, రాములు, రవికుమార్‌గుప్తా, ప్రభాకర్‌గుప్తా పాల్గొన్నారు.

రవీంద్రనాథ్‌కు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రవీంద్రనాథ్‌సింగ్

సైదాబాద్ : విద్యా పరిశోధన రంగంలో చేసిన కృషికి సైదాబాద్‌లోని బోజిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రవీంద్రనాథ్‌సింగ్‌కు జాతీయస్థాయి భారత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగిన వేడుకల్లో వైస్ చాన్సలర్ ప్రసాద్‌రెడ్డి, ఏఐసీటీఈ చీఫ్ కో ఆర్డినేటర్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ అవార్డును ప్రదానం చేశారు. విద్యాపరిశోధన రంగంలో చేసిన కృషికి జాతీయస్థాయిలో ఈ అవార్డు లభించిందని తెలిపారు. మంగళవారం రవీంద్రనాథ్‌ను కళాశాల యాజమాన్యం అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

కోహెడలో ఉచిత వైద్య శిబిరం

హయత్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు ఉచితంగా బీపీ, షుగర్, ఇతర పరీక్షలను నిర్వహించి మందులు అందజేశారు. మెడ్‌విజన్ ఆస్పత్రి వారు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మూల సత్తయ్యగౌడ్, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు పాండుగౌడ్, కోహెడా గ్రామ శాఖ అధ్యక్షుడు పాతూరి రంగయ్యగౌడ్, కార్యదర్శి బద్దం కుమార్‌గౌడ్, నాయకులు దేవేందర్, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాదళ్ నూతన కమిటీ సభ్యులు

సేవాలాల్ మహారాజ్ బంజారాదళ్ కమిటీ ఎన్నిక

వనస్థలిపురం : సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాదళ్ నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబునాయక్ ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇస్లావత్ చందునాయక్, ప్రధాన కార్యదర్శిగా భరత్‌లాల్ రాథోడ్, కోశాధికారిగా గుగులోత్ హుస్సేన్‌నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చందునాయక్ మాట్లాడుతూ బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తమ నియామకానికి కృషి చేసిన కుల పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.



హనుమాన్ శోభాయాత్రలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కుటుంబ సభ్యులు



చావునీ రామాలయ రథసేవలో ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



సరూర్‌నగర్‌లో వేడుకల్లో కార్పొరేటర్ శ్రీవాణి అంజన్ తదితరులు

ఘనంగా హనుమాన్ జయంతి

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
● శోభాయమానంగా శోభాయాత్ర

జోన్‌బృందం: హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్‌జోన్ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆంజనేయస్వామి విగ్రహాలను పూలతో అలంకరించారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ శోభాయాత్రను నిర్వహించారు. చంపాపేట కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర కనుల పండువగా సాగింది. శోభాయాత్రను నందికొండ శ్రీగాయత్రి పీఠాధిపతి కాతేంద్ర స్వామి ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో పెద్ద ఎత్తున భక్తులు హాజరై ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయడం హర్షణీయం: ఎమ్మెల్యే

వనస్థలిపురం: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వనస్థలిపురం గురుద్వార్ సమీపంలోని రామాలయం నుంచి సాహెబ్‌నగర్ త్రినేత్ర ఆంజనేయస్వామి ఆలయం వరకు హనుమాన్ శోభాయాత్ర కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హనుమాన్ శోభాయాత్రకు పార్టీలకు, కులమతాలకు అతీతంగా భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం హర్షణీయమన్నారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో తమ పండుగలను నిర్వహించుకోవడం అభినందనీయమని తెలిపారు. అనంతరం భక్తులతో ఎమ్మెల్యే నృత్యం చేసి అలరించారు.



బాలాపూర్ దేవతలగుట్టపై నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకల్లో మేయర్ పారిజాతారెడ్డి, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు



కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న మాజీమంత్రి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి



డైమండ్‌కాలనీలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తదితరులు



సాహెబ్‌నగర్‌లోని త్రినేత్ర ఆంజనేయస్వామి ఆలయంలో కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు



భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ ఆలయం వద్ద నిర్వహించిన శోభాయాత్రలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తదితరులు



కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం వద్ద శోభాయాత్రను ప్రారంభిస్తున్న పీఠాధిపతి కాతేంద్రస్వామి



గడ్డిఅన్నారంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

కేంద్ర పథకాలను పక్కదారి పట్టిస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

● గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వమూ ఇలాగే చేసింది
● చేవెళ్ల బీజేపీ అభ్యర్థి సతీమణి సంగీతారెడ్డి ధ్వజం



మీర్‌పేట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణలో అమలవుతున్న పలు పథకాలకు నిధులు ఇస్తున్నా ఇక్కడి ప్రభుత్వం మాత్రం వాటిని పక్కదారి పట్టిస్తూ ప్రజలను మోసం చేస్తున్నదని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం ఇలాగే వ్యవహరించిందని ఆమె ధ్వజమెత్తారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్‌లో కొండాకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి బీజేపీ కేంద్రంలో అమలు చేస్తున్న పథకాలు, రాష్ట్రంలో అమలు చేయబోయే పథకాలతో ముద్రించిన కరపత్రాలు స్థానికులకు పంపిణీ చేశారు. అనంతరం సంగీతారెడ్డి మాట్లాడుతూ కేంద్ర పథకాలను రాష్ట్రంలో అమలు చేయకపోవడం వల్ల ఇక్కడి అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, రాష్ట్రానికి మంజూరవుతున్న నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం తరఫున ఎంపీ అభ్యర్థులను ఎక్కువ మందిని గెలిపిస్తేనే కేంద్ర పథకాలన్నీ రాష్ట్రంలోనూ సక్రమంగా అమలవుతాయని ఆమె అన్నారు. ఈ దృష్ట్యా చేవెళ్లలో కొండాను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీజేపీ మీర్‌పేట్‌శాఖ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, కె.సోమేశ్వర్, కార్పొరేటర్ భిక్షపతిచారి, పార్టీ నాయకులు సూల ప్రభాకర్, గడ్డం జగన్, రాజశేఖర్‌రెడ్డి, జేడీ కుమార్, రమేశ్‌ముదిరాజ్, గోపీనాథ్, దామోదర్‌రెడ్డి, నాగకుమారి, రఘు, వెంకటేశ్ పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో గులాబీ జెండా ఎగురవేస్తాం

● జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ కమలాసుధీర్‌రెడ్డి



నాగోల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కమలాసుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరిపై గులాబీ జెండాను ఎగురవేస్తామని జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగోల్ డివిజన్ శివపురికాలనీలో దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులే బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. మల్కాజిగిరి మరింతగా అభివృద్ధి కావాలంటే ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓట్లు వేసి బీఆర్ఎస్‌ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, ఎల్బీనగర్ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి, శిల్పారెడ్డి, కవిత, రంజిత్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


● హాజరైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాములలోని రామగిరిగుట్టలో సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం రాత్రి సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. సుందరసువిశాలమైన కల్యాణ మండపంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వేలాది మంది భక్తుల సమక్షంలో సీతారాముల కల్యాణం జరిగింది. స్వామివారి వేడుకలకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై తిలకించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన ఆయనకు పండితులు తీర్థ ప్రసాదములు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నచిరంజీవి, జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మణెమ్మరామలింగం, కోఆప్షన్ సభ్యులు శంకరయ్యగౌడ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి కన్వీనర్‌గా రవీంద్రాచారి



రవీంద్రాచారి

సరూర్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్‌గా మీర్‌పేట్‌కు చెందిన వడ్రోజు రవీంద్రాచారి నియమితులయ్యారు. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గారావు మంగళవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రచారి మాట్లాడుతూ బీసీలకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ పార్టీకే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తమ ఫెడరేషన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు.

రెండు క్లినిక్‌లపై
ఔషధ నియంత్రణ అధికారుల దాడులు

● ఓ క్లినిక్ వద్ద రూ.5.52 లక్షలు, మరో క్లినిక్‌లో రూ.లక్ష మందులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు మెడిసిన్స్‌ను విక్రయిస్తున్న ఓ క్లినిక్‌పై ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు దాడులు చేశారు. వనస్థలిపురంలోని ఓ క్లినిక్‌లో ఉత్పత్తి సంస్థ నిర్ణయించిన సీలింగ్ ధర కంటే ఎంఆర్‌పీ ఎక్కువగా విక్రయిస్తున్నారు. మంగళవారం దాడులు చేసిన అధికారులు క్లినిక్‌లో పరిశీలించగా గుట్టురట్టు అయ్యింది. విక్రయిస్తున్న వాటిల్లో ఇట్రారోల్-100 ఎంజీ, ఇట్రారోల్-200 ఎంజీ మందులున్నాయి. దీంతో అక్కడ నున్న రూ.5.52 లక్షల విలువ చేసే మందులను స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి పరిధిలోని బౌరంపేట గ్రామంలో క్యాక్ క్లినిక్‌పై ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు దాడులు చేశారు. అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన మందులను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ వైద్య సిబ్బందికి ఎలాంటి అర్హత లేకపోయినా చికిత్సలు అందిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆ క్లినిక్‌ను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. అనుమతి లేకుండా క్లినిక్ ఆవరణలో ఉన్న రూ.లక్ష విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. యాంటి బయాటిక్స్, స్టెరాయిడ్స్ అనాల్జెసిక్స్ యాంటీ అల్సర్ డ్రగ్స్ తదితర 26 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రకాల స్టెరాయిడ్స్‌ను దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించారు.



ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్‌లో అకార్డియన్ టెక్నాలజీస్ కార్యాలయం

● ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

రవీంద్రభారతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): యూకెకు చెందిన ప్రముఖ సంస్థ అకార్డియన్ టెక్నాలజీస్ కార్యాలయాన్ని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హైటెక్‌సిటీలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబుకు సంస్థ చేస్తున్న కార్యక్రమాల గురించి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభల శ్రీనివాస్ వివరించారు. ఇప్పటికే 80 మంది సిబ్బందితో ఎంతోమందికి తమ సేవలు అందుబాటులో ఉన్నాయని, భవిష్యత్తులో మరో 100 మంది సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కామరాజు నరేంద్రకుమార్, ప్రదీప్‌కుమార్, హర్కార శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసును తప్పు దోవ పట్టించిన ఎస్ఐ సస్పెన్షన్

గాజులరామారం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసును ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నించిన ఓ ఎస్సైను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. జనవరిలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం పోలీస్‌స్టేషను పరిధిలోని ఓ గుడి పక్కన నిర్మానుష ప్రాంతంలో ఓ గుర్తు తెలియని మహిళ హత్యకు గురయింది. ఆ ఘటనపై గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లుగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే సూరారం స్టేషనులో అడ్మిన్ ఎస్సైగా ఉన్న నారాయణసింగ్ ఈ కేసును ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నం చేయడంతో ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేశారు.

తిరుమల ఘాట్‌లో ఆగిన కారును ఢీకొన్న బస్సు

● స్వల్పగాయాలతో బయటపడిన హైదరాబాద్ భక్తులు

తిరుమల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో ఆగి ఉన్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం కారు(ఏపీ 39 డీజే 2708)లో మంగళవారం మధ్యాహ్నం అలిపిరి వద్ద తనిఖీలు పూర్తి కాగానే తిరుమలకు బయలుదేరారు. వినాయక ఆలయం దాటిన తర్వాత ఓ మలుపు వద్ద సాంకేతిక సమస్యతో కారు నిలిచిపోయింది. ఆ సమయంలోనే వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు(ఏపీ 03 జెడ్ 0187) కారును ఢీకొంది. దీంతో కారు రోడ్డుపై నుంచి ముందుకు దూసుకువెళ్లింది. కారులోని ఆరుగురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు వెనక భాగం ధ్వంసమైంది. మరోవైపు ఆర్టీసీ బస్సు ముందు అద్దం పగిలిపోవడంతోపాటు ముందుభాగం స్వల్పంగా దెబ్బతిన్నది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మీ డబ్బులు మాకొద్దు బాబోయ్..!

● కళాశాల యాజమాన్యాలతో జేఎన్‌టీయూ ఎఫ్ఎఫ్‌సీ అధికారులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ(ఎఫ్ఎఫ్‌సీ)తనిఖీల వ్యవహారం కొత్తమలుపు తిరిగింది. మొన్నటి వరకు తనిఖీల కోసం ప్రైవేట్ కాలేజీలకు వెళ్లిన కొందరు జేఎన్‌టీయూ అధికారులు పెద్దమొత్తంలో ముడుపులు డిమాండ్ చేశారు. తాజాగా 'మీ డబ్బులు మాకొద్దు బాబోయ్' అంటూ.. ఆయా కాలేజీల యాజమాన్యాలకు ఓ నమస్కారం పెట్టి వెనుదిరుగుతున్నారు. ఈమార్పు చూసి జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. తనిఖీల సమయంలో సొమ్ము తీసుకోకుండా నిలువరించిన జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు అఫిలియేషన్ ఇచ్చేటప్పుడు కూడా ఇదే పద్ధతిని పాటిస్తారో, లేదోనని కాలేజీల యాజమాన్యాలు సందేహం వ్యక్తం చేస్తున్నాయి. కాగా, తనిఖీ అధికారులపై ఎన్నికల అధికారులు కూడా నిఘాపెట్టారు.

ఉచిత నీటి ట్యాంకర్ల గోల్‌మాల్‌ను అరికట్టండి

సైదాబాద్, ఏప్రిల్ 23ఆంధ్రజ్యోతి): వైశాలీనగర్ జలమండలి కార్యాలయంలో అధికారుల పర్యవేక్షణ కొరవడంతో సింగరేణి గుడిసెలకు సరఫరా చేయాల్సిన ఉచిత నీటి ట్యాంకర్లు పక్కదారి పడుతున్నాయని సేవాలాల్ బంజరా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోర్ర మోతీలాల్ నాయక్ ఆరోపించారు. మంగళవారం సింగరేణి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి గుడిసెలకు నల్లాలు లేకపోవడంతో నిత్యం 100-120 ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారని తెలిపారు. కానీ కొందరు సిబ్బంది, అధికారులతో కుమ్మక్కై ఉచిత ట్యాంకర్లను పక్కదారి పట్టిస్తూ డబ్బులు దండుకుంటున్నారని అన్నారు. దీంతో గుడిసెవాసులకు సక్రమంగా నీరు అందక తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ట్యాంకర్ల వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే శనివారం వైశాలీనగర్ జలమండలి కార్యాలయం ఎదుట గుడిసెవాసులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు.